PRGI NO: TGTEL/25/A2356

# మేకార్తి దినపత్రిక

సోమవారం 01-06-2026 | పేజీలు : 6 | వెల రు : 4/- | సంపుటి : 1 సంచిక : 269 | WWW.MEKARTHI DINAPATRIKA.COM

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

# 'అదే జరిగితే ఎన్నికల్లో పోటీ చేయం'..

## BRSకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

- బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్
- ఉచిత విద్యుత్ నిలిపితే పోటీ చేయమన్న సీఎం
- రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుందన్న వ్యాఖ్య
- బీజేపీ-బీఆర్ఎస్ కలిసి పోటీ చేస్తాయన్న ఆరోపణ
- హరీశ్‌రావుపై సంచలన వ్యాఖ్యలు
- ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్రతో చర్చల ప్రయత్నం
- 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటానన్న రేవంత్
- జీహెచ్ఎంసీ ఎన్నికలకు తొందర లేదన్న సీఎం

హైదరాబాద్: భారత రాష్ట్ర సమితికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు మీటర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే.. తాము ఎన్నికల్లో పోటీ చేయబోమన్నారు. తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే.. బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా? అని సవాల్ విసిరారు. రైతుల ముసుగులో కేసీఆర్ రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారని ఆరోపించారు. "అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాం. ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నాం. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుంది. మేం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే.. రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నాం. మేం తీరుస్తున్న అప్పుల గురించి



రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పాం. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతి లేదు.

**'హరీశ్‌రావు ఆ విషయం ఒట్టేసి చెప్పాలి'..**

కేసీఆర్ మీద ఒట్టేసి.. బీఆర్ఎస్‌లోనే ఉంటానని హరీశ్‌రావు చెప్పాలి. గతంలోనూ హరీశ్‌రావు.. వైఎస్సార్ దగ్గరికి వెళ్లారు. ఆయన ఎవరెవరితో మాట్లాడుతున్నారో నాకు తెలుసు.. కానీ చెప్పను. ఇటీవల పార్టీ మీటింగ్ వదిలేసి ఆయన ఢిల్లీకి ఎందుకు వెళ్లారు? భాజపా, బీఆర్ఎస్‌లు కలిసి పోటీ చేస్తాయనడంలో అనుమానమే లేదు. సీబీఎస్ఈలో జవాబుపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా.. కేటీఆర్ బినామీ సంస్థ. కేంద్రంలోని భాజపా సర్కారు వద్దు సరిగ్గా కొనుగోలు చేయడం లేదు. రాష్ట్రంలో 32 శాతం ధాన్యం మాత్రమే కొంటోంది. భాజపా నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తాం. అంతర్రాష్ట్ర జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ చెబుతున్నారు. ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నాం. ఆయన ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు? 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటాను. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, నాది విజయవంతమైన కాంబినేషన్. మేం అన్ని ఎన్నికలు గెలిచాం. భవిష్యత్తులోనూ విజయం సాధిస్తాం. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆయనకు మంచి పదవి రావొచ్చు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదు. ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేనితనం. పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే నేను. వివాదాలు, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవడం లేదు" అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు.

## సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఎన్నిక



- కర్ణాటక సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఎన్నిక
- సీఎల్పీ సమావేశంలో ఏకగ్రీవ ఎంపిక
- డీకే పేరును ప్రతిపాదించిన సిద్ధరామయ్య

కర్ణాటకలో నాయకత్వ మార్పు ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ పార్టీ శాసనసభా పక్ష నేతగా డీకే శివకుమార్ ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం విధాన సౌధలో జరిగిన సీఎల్పీ సమావేశంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు డీకేను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. శివకుమార్ పేరును మాజీ సీఎం సిద్ధరామయ్య ప్రతిపాదించగా సీనియర్ నేత పరమేశ్వర బలపరిచినట్లు తెలిసింది.

మరోవైపు జూన్ 3న నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కర్ణాటక కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది. ఇందుకోసం బెంగళూరులోని లోక్‌భవన్ గ్లాస్ హౌస్‌లో ఏర్పాట్లు కూడా చేస్తున్నట్లు తెలిపింది. తాజాగా సీఎల్పీ నేతగా ఎన్నికైన డీకేఎస్.. గవర్నర్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు తనను ఆహ్వానించాలని

## ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసులను హడలెత్తిస్తోన్న పెద్దపులి



పోలవరం: గత నాలుగు నెలలుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసులను హడలెత్తిస్తోన్న పెద్ద పులి.. మళ్లీ దాడులు చేస్తూ భయాందోళనలకు గురి చేస్తోంది. ఇటీవల రాత్రి వేళల్లో పశువులపై దాడి చేస్తూ ... పోలవరం జిల్లాలో తిరుగుతూ కలకలం రేపుతోంది. పేజి 2లో ▶

## డీఎస్సీ నిర్వహణపై ఆరోపణలు అవాస్తవం: కోన శశిధర్



2లో

## జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను పరిశీలించిన పవన్ కల్యాణ్

### జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను సందర్శించిన పవన్



2లో

- చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తిపై వివరాలు సేకరణ
- ప్లాంట్ వ్యయం, నిర్వహణపై ఆరా
- కాకినాడ ప్లాంట్ ఆలస్యంపై ప్రశ్న
- నవంబరు నాటికి అందుబాటులోకి తెస్తామని జిందాల్
- కాలుష్య నియంత్రణ చర్యలపై నివేదిక కోరిన పవన్
- పీసీబీ ఏడాదికి నాలుగుసార్లు నివేదిక ఇస్తోందని వెల్లడి

## పట్టణ పేదలకు పెద్దన్నరేవంత్ రెడ్డి కానుక

### రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

- తొలి విడతగా లక్ష, మలి విడత మరో లక్ష ఇళ్ల నిర్మాణం
- ఏడాదిలోగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక
- పేదవాని గుమ్మం వద్దకు ప్రజా ప్రభుత్వ పథకాలు
- ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు



మిగతాది 2లో

పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల పరిధిలోనే అధునాతనమైన ఇందిరమ్మ ఇళ్లను కట్టి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలో క్యూర్ పరిధిలో తొలివిడతగా మంజూరు చేసిన లక్ష ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడమేగాక ఏడాది తిరిగిలోగా వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

## బాల్క సుమన్ అరెస్ట్.. తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత



మిగతాది 2లో

- బాల్క సుమన్‌ను అరెస్ట్ చేసిన నాంపల్లి పోలీసులు
- తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత
- పోలీసులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్యకర్తల నిరసన
- బాల్క సుమన్‌పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు
- మీడియాతో మాట్లాడిన తర్వాత అరెస్ట్

## తితిదేకు భారీ విరాళం అందించిన నీరా రాడియా



2లో

## గుంటూరు జీజీహెచ్ భవనంపై నుంచి దూకి రోగి ఆత్మహత్య




మిగతాది 2లో

## CBSE మార్కుల గందరగోళంపై విద్యార్థుల పోరాటం స్ఫూర్తిదాయకం: కేటీఆర్



హైదరాబాద్: తెలంగాణలో 2019 ఇంటర్ ఫలితాలను తారుమారు చేసిన గ్లోబరీనా అనే సంస్థ.. తన పేరు మార్చుకుని, సీబీఎస్ఈ నుంచి కాంట్రాక్టును దక్కించుకుని, అంతకంటే పెద్ద గందరగోళాన్ని సృష్టించిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. సీబీఎస్ఈ మార్కుల వ్యవహారంపై పోరాడుతున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అధికారంలో ఉన్నవారిని వారు జవాబుదారీగా నిలబెడుతున్న తీరు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

మిగతాది 2లో

# సంపాదకీయం

## మోదీని రాహుల్ జయించగలడా?

గత సార్వత్రక ఎన్నికలు ముగిసిన కొద్ది రోజులకు యువ కాంగ్రెస్ శాసనసభ్యుడు ఒకరు నాకు తటస్థించారు. తమ నాయకుడు రాహుల్‌గాంధీకి ఐదు సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు. నేను ఇవ్వగల సలహా ఒక్కటే ఉన్నదని చెప్పాను: వయనాడ్ నుంచి లోక్‌సభకు ప్రియాంకగాంధీ పోటీ చేయకూడదు. నా యీ సలహాను నిర్లక్ష్యం చేస్తారని నిశ్చితంగా చెప్పగలను అని ముక్తాయించాను.

రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ఆయన నాయకత్వం పట్ల విశ్వసనీయతను పెంపొందించిందనడంలో సందేహం లేదు. ఆ యాత్రతో ఆయన ప్రజల మనిషిగా భాసించారు. అయితే సార్వత్రక ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌ను మళ్లీ ఒక కుటుంబ జమీగా అయిపోవడంతో భారత్ జోడో యాత్ర సత్ఫలితాలు వ్యర్థమైపోయాయి. ప్రియాంకగాంధీ వయనాడ్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. తాను దక్షిణాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, తన సోదరుడు ఉత్తరాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, తద్వారా తాము ఈ సువిశాల దేశాన్ని సమైక్యం చేస్తున్నామని ప్రియాంక వాగాడంబరం ప్రదర్శించారు.

2024 సార్వత్రక ఎన్నికలలో 99 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించడంతో రాహుల్ విధేయులు ఆయనను ప్రధానమంత్రి కాబోయే వ్యక్తి అని కీర్తించడం ప్రారంభించారు. దేశ రాజధాని న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న మేధావులు, పాత్రికేయులు కూడా ఆ కీర్తనతో ఏకీభవించారు. రెండు సంవత్సరాల తరువాత వెనుతిరిగి చూస్తే వారి ఆనందోత్సాహాలు తొందరపాటుతో కూడుకున్నవని అనిపిస్తోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో కేవలం ఒకే ఒక్క రాష్ట్రం-- కేరళ--లో మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో కాంగ్రెస్ క్రమంగా వెనుకపడిపోతోంది. ఒకప్పుడు కాంగ్రెస్ ఏలుబడిలో ఉన్న గుజరాత్, మధ్యప్రదేశ్, హర్యానాలో బీజేపీ స్వతస్సిద్ధ పాలకపక్షంగా భాసిల్లుతోంది. కాంగ్రెస్ పతనాన్ని రాహుల్‌గాంధీ నిలువరించలేకపోతున్నారు. 2008లో కాంగ్రెస్ నాయకత్వాన్ని ఆయన లాంఛనంగా చేపట్టినప్పుడు దేశ వ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శాసనసభ్యుల సంఖ్య 1204 నుంచి ఇప్పుడు 676కి పడిపోయింది.

రాహుల్‌గాంధీని స్వయంగా కలిసి మాటా మంతీ జరిపాను. ఆయనతో నేను ఉత్తర ప్రత్యుత్తరాలూ సాగించాను. జవహర్‌లాల్ నెహ్రూ మునిమనవడు సద్వర్తనుడు, సందేహం లేదు. ఈ కొద్ది పాటి పరిచయం కూడా లేకపోయినప్పటికీ ఆయన పట్ల నాకు అపార సానుభూతి ఉండేది. ఆయన లోనైన వ్యక్తిగత విషాదాలే ఆ సానుభూతిని కలిగించాయి. యాభై ఐదు సంవత్సరాల వయసులో ఉన్న రాహుల్ తన తల్లి సంకల్పసాధనకు ఒక సాధనంగా మిగిలిపోయాడు. సోనియాగాంధీ ఆదేశం మేరకే ఆయన రాజకీయాలలో ప్రవేశించారనే విషయంలో ఎవరికీ సందేహం లేదు. ఆమె చెప్పిన విధంగానే కాంగ్రెస్‌కు సారథ్యం వహిస్తున్నారు. అయితే మన గణతంత్ర రాజ్యం మౌలిక విలువలు, మనుగడ ప్రమాదంలో పడిన ప్రస్తుత సందర్భంలో ప్రజాచర్చ మారాలి. అది స్పష్టంగా, కఠినంగానే కాకుండా క్రూరంగా కూడా జరగాలి. రాహుల్‌గాంధీ మంచి మనిషి, ఉత్తమ భారతీయుడే. అయితే బీజేపీ విద్వేషపాలనను అంతమొందించేందుకు ఆరాటపడుతున్నవారు తమ ప్రధాన ఆశాజ్యోతిగా రాహుల్‌ను చూడడాన్ని మానుకోవడం మంచిది.

ప్రధానమంత్రి పదవి విషయంలో నరేంద్ర మోదీకి భావి సవాల్‌దారు అయిన రాహుల్‌లో క్రమశిక్షణ, హుందాతనం, విద్యార్హతలు, నాయకత్వ నైపుణ్యాలు కొరవడ్డాయి. ఎన్నికల సంఘం పక్షపాత కార్యసరళి లాంటి సమస్యపై కూడా ఆయన నిర్విరామంగా పోరాడలేదు. 'ఓటు చోరీ'పై ఒకరోజు విలేఖర్ల సమావేశంలో పాల్గొని, మరుసటి రోజే యూరోప్ లేదా లాటిన్ అమెరికాకు వెళ్లిపోవడాన్నే దేశ ప్రజలు చూశారు. తన 22 ఏళ్ల రాజకీయ జీవితంలో భారత్ జోడో యాత్ర చేసిన కొద్ది నెలలు మాత్రమే ప్రజాసమస్యలపై ఆయన తదేక దీక్షతో శ్రద్ధ చూపడం జరిగింది. బీజేపీ నాయకులు అటువంటి దీక్షతో 365 రోజులూ రేయింబవళ్లు పనిచేస్తుంటారు. ఈ రోజుల్లో ఆయన తన రాజకీయ కార్యకలాపాలను చాలావరకు సామాజిక మాధ్యమాల ద్వారా నిర్వహిస్తున్నారు. ఆయన పోస్ట్‌లకు వెన్వెంటనే లైక్‌లు వెల్లువెత్తుతాయి. అయితే ఆయన వ్యాఖ్యలు 24 గంటలలోపే పూర్తిగా విస్మృతమయిపోతున్నాయి! 2004లో లోక్‌సభ సభ్యుడుగా ఎన్నికవక ముందు రాహుల్ ఎక్కడైనా ఏదైనా ఉద్యోగం చేశారా లేదా అన్నది ఎవరికీ తెలియదు. యూపీఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో మంత్రిపదవిని చేపట్టేందుకు ఆయన అంగీకరించలేదు. మరి ఆయన ప్రస్తుత కల్లోల అంతర్జాతీయ పరిస్థితులలో ఈ సువిశాల దేశానికి ప్రభావశీల ప్రధానమంత్రి కాగలరని భారతీయ ఓటర్లు ఎందుకు విశ్వసించాలి? గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోలేని చేతకానితనం రాహుల్‌కు ఉన్నది. 2019లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్ నిర్వహించిన 'చౌకీదార్ చోర్' ప్రచారం ఘోరంగా విఫలమవడమే కాకుండా కాంగ్రెస్‌నే ఎదురు దెబ్బతీసింది. అయినప్పటికీ పాలనా వైఫల్యాలు లేదా తన సొంత పార్టీని గ్రామ స్థాయి నుంచి పటిష్ఠం చేయడంపై దృష్టి పెట్టకుండా ప్రధానమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని రాహుల్ కొనసాగిస్తున్నాడు.

సందర్భవశాత్తు చాలా మంది పట్టించుకోని ఒక వాస్తవాన్ని చెప్పవలసి ఉన్నది: అధికారం వంశపారంపర్య హక్కు కాదనే విషయాన్ని ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలు నిరూపించాయి. అసోంలో తరుణ్ గొగోయ్ కుమారుడు కాంగ్రెస్ ప్రచారానికి నాయకత్వం వహించడం బీజేపీ విజయానికి దోహదం చేసింది. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ తన మేనల్లుడు అభిషేక్‌కు అగ్రప్రాధాన్యమివ్వడం ఆమెకే నష్టదాయకమైనది. తమిళనాడులో స్టాలిన్ తన కుమారుడు ఉదయనిధిని అందలాలు ఎక్కించడం విజయ్ విజయానికి విశేషంగా తోడ్పడింది. కేరళలో పినరయి విజయన్ తన అల్లుడిని ప్రమోట్ చేయడం కాంగ్రెస్ విజయానికి సహాయపడింది. ఆయా పార్టీల జయాపజయాలకు ఇంకా చాలా కారణాలు ఉన్నప్పటికీ వంశపారంపర్య రాజకీయాలకు ప్రజల తిరస్కృతి వాటిలో మరింత ముఖ్యమైనది.

## గుంటూరు జీజీహెచ్ భవనంపై నుంచి దూకి రోగి ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి

గుంటూరు: జీజీహెచ్ భవనంపై నుంచి దూకి రోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గుంటూరులో జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా ఉండి గ్రామానికి చెందిన చెన్నంశెట్టి శ్రీనివాస్ కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతూ ఈనెల 23న ఆసుపత్రిలో చేరారు. శనివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన శ్రీనివాస్ ఆసుపత్రి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీనివాస్ తాపీ మేస్త్రీగా జీవనం సాగించే వాడని, అతని భార్యత కొంత కాలం క్రితం మరణించినట్టు సమాచారం.

## CBSE మార్కుల గందరగోళంపై విద్యార్థుల పోరాటం స్ఫూర్తిదాయకం: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

"గతంలో తెలంగాణలో గ్లోబరీనా వ్యవహారంపై బీఆర్ఎస్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంది. ముగ్గురు సభ్యుల కమిటీ నివేదిక ఆధారంగా.. సంబంధిత అధికారులను తొలగించింది. అదేవిధంగా ఆ సంస్థపై కోర్టులో కేసు వేసింది. ఆ సంస్థ చరిత్రను సీబీఎస్ఈ విస్మరించింది. అసమర్థ సంస్థకు అనుకూలంగా ఉండేందుకే సీబీఎస్ఈ నిబంధనలను మార్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై కేంద్రం, విద్యాశాఖ మంత్రి సమాధానం చెప్పాలి. ఇటువంటి వ్యవస్థపై దేశ భవిష్యత్తును నిర్మించలేం" అని కేటీఆర్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు.

## బాల్క సుమన్ అరెస్ట్.. తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను నాంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ భవన్‌లో బాల్క సుమన్ ఉన్నారన్న సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన పోలీసులతో బీఆర్ఎస్ కార్యకర్తలు వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు గో బ్యాక్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఆ తర్వాత పోలీసులతో బీఆర్ఎస్ న్యాయవాదులు మాట్లాడారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌పై నాంపల్లి పీఎస్‌లో నాన్ బెయిలబుల్ కేసు నమోదైందని, ఎలాంటి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని అబిడ్స్ ఏసీపీ తెలిపారు. పోలీసులు భారీగా మోహరించడంతో కొంత సేపటి తర్వాత బాల్కా సుమన్ తెలంగాణ భవన్ నుంచి బయటకు వచ్చి మీడియాతో మాట్లాడిన తర్వాత అరెస్ట్ చేసి తీసుకెళ్లారు.

కాంగ్రెస్ పాలకులు ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్నారు: బాల్క సుమన్

"తెలంగాణ ఉద్యమంలోనూ నన్ను టార్గెట్ చేశారు. ఉద్యమ సమయంలో నాపై 250కి పైగా కేసులు పెట్టి.. అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. ఇటీవల క్యాతనపల్లి ఎన్నిక సమయంలోనూ నన్ను జైల్లో పెట్టారు. అయినా, సరే ప్రజాప్రతినిధిగా ప్రభుత్వాన్ని నిరంతరం ప్రశ్నిస్తూనే ఉన్నా. మరోసారి నన్ను జైలుకు పంపాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వివేక్ నిర్ణయించారు. నన్ను జైల్లో పెట్టి పైశాచికానందం పొందాలని పాలకులు భావిస్తున్నారు. నాపై దృష్టి పెట్టే ముందు ప్రజల సమస్యలపై దృష్టి సారించాలి. సింగరేణిలో వందల కోట్ల విలువైన స్కాములు జరుగుతున్నాయి. సింగరేణి కుంభకోణాలమయంగా మారిపోయింది. కాంగ్రెస్ పాలకులు ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్నారు. చట్టంపై, వ్యవస్థలపై, రాజ్యాంగంపై నమ్మకం ఉంది. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా పోలీసులకు సహకరిస్తా. నేను ఎక్కడికీ పారిపోలేదు.. పార్టీ కార్యక్రమంలో ఉన్నా. ప్రశ్నించే నేతలను వేధించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారింది" అని బాల్క సుమన్ ఆరోపించారు.

## పట్టణ పేదలకు పెద్దన్నరేవంత్ రెడ్డి కానుక

మొదటిపేజీ తరువాయి

శనివారం నాడు బంజారాహిల్స్‌లో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వలే ప్రజలు ఒకచోట ఇళ్లు 30-40 కిలోమీటర్ల అవతల ఉండేలా చేయబోమని , ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్ గా తీసుకొని ఏ నియోజకవర్గ ప్రజలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు నిర్మిస్తామని ఇది పేదలకు పెద్దన్న , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా అందిస్తామని అన్నారు. రాష్ట్రంలో పేదవాని గుమ్మం వద్దకే ప్రజా ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ , సర్వే తదితర శాఖలు ఒకే చోట అందుబాటులోకి తెచ్చేలా ఈ సమీకృత భవనాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. తమ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలలో భాగంగా మూడు కార్పొరేషన్ల పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటు రంగానికి ధీటుగా కార్పొరేట్ తరహాలో అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. అంతేగాక ప్రభుత్వానిపై ఈ నిధుల భారం పడకుండా రియల్ ఎస్టేట్ నిర్మాణరంగంలో ప్రసిద్ధమైన సంస్థలకు నిర్మించే బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. మరి కొద్ది నెలల్లో ఇక్కడ ఫినిక్స్ సంస్థ 30వేల చదరపు అడుగుల్లో ఈ భవనాన్ని పూర్తి చేసి ఇస్తుందని వెల్లడించారు. బంజారాహిల్స్ సమీకృత భవనంలో ఎస్.ఆర్. నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు , డిఐజి కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ - గోల్కొండ కార్యాలయాలు వస్తాయని వీటివలన ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని ఉద్యోగ, వ్యాపార సౌకర్యాలు కలుగుతాయన్నారు. వందలాది సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నమాజ్‌చేసుకుంటున్న ముస్లిం సోదరులకు ఏటా రెండు సార్లు నమాజు కార్యక్రమం నిర్వహించుకునేలా అధికారులను ఆదేశించామని ప్రకటించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షత వహించగా ఎంపీ అనీల్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వాతావరణ సూచనలు

**తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం**

**ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల**

రాష్ట్రంలోని రైతులకు సమయానుకూల వాతావరణ సమాచారం, శాస్త్రీయ వ్యవసాయ సూచనలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమంను రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం అధికారికంగా ప్రారంభించారు. తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, డెవలప్మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా (డీఐఎల్ ఇండియా), ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ, డెవలప్మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా మరియు ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ సందర్భంగా ఎవిడెన్స్ యాక్షన్ సంస్థ కంట్రీ డైరెక్టర్ శ్రీ అంకుర్ గర్ న్యూఢిల్లీ నుండి జూమ్ ద్వారా పాల్గొని, తమ సంస్థ రైతుల కోసం కృత్రిమ మేధస్సు ఆధారంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను మంత్రి గారికి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది తెలంగాణ రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటూ, ఈ అవకాశాన్ని కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి మరియు ప్రత్యేకంగా మంత్రి గారికి ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వంతో కలిసి భవిష్యత్తులో మరిన్ని సేవలను రైతులకు అందించేందుకు కృషి

## గొడ్డలి పార్టీ అంశం.. సైకోలో ఫ్రస్టేషన్ పెరుగుతోంది: చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

**బక్కని నర్సింహులు వ్యాఖ్యలు సరికాదు: చంద్రబాబు**

తెదేపా జనరల్ సెక్రటరీలు, జోనల్ ఇన్‌ఛార్జులు, ముఖ్యనేతలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమావేశమయ్యారు. హైబ్రిడ్ మహానాడు విజయవంతమైందన్నారు. మహానాడు సందర్భంగా తెలంగాణ తెదేపా నేత బక్కని నర్సింహులు చేసిన వ్యాఖ్యలను ముఖ్యమంత్రి తప్పుపట్టారు. తెలంగాణపై ఆయన చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతీయకూడదని సూచించారు. తెలుగు జాతి ఒక్కటేనని చెప్పారు. తెదేపా పుట్టిందే తెలంగాణ గడ్డపై అని గుర్తుచేశారు. ఆ రాష్ట్రంలో ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉందన్నారు.

ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ నేతలతో చంద్రబాబు భేటీ అయ్యారు. రాజ్యసభ స్థానాలకు అవకాశం కల్పించాలని పలువురు ఆశావహులు ఆయన్ను కోరారు. వర్ల రామయ్య, కంభంపాటి రామ్మోహన్‌రావు, రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి తదితరులు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

## జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను పరిశీలించిన పవన్ కల్యాణ్

మొదటిపేజీ తరువాయి

గుంటూరు: నాయుడుపేటలోని జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సందర్శించారు. ఈ ప్లాంట్‌లో చెత్త నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్లాంట్ ఏర్పాటు వ్యయం, నిర్వహణ గురించి పవన్ ఆరా తీశారు. విద్యుత్ ఉత్పత్తి, యూనిట్ విక్రయ ఛార్జీలను ప్లాంట్ ప్రతినిధులు ఆయనకు వివరించారు. కాకినాడ జిందాల్ ప్లాంట్ ఇంకా ఎందుకు వినియోగంలోకి రాలేదని డిప్యూటీ సీఎం ప్రశ్నించగా.. నవంబరు లోపు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. విద్యుత్ ప్లాంట్లలో కాలుష్యంపై, కాలుష్య నియంత్రణ చర్యలపై నివేదిక ఇవ్వాలని పవన్ కోరారు. ఏడాదికి నాలుగుసార్లు పీసీబీ నివేదిక ఇస్తోందని జిందాల్ ప్రతినిధులు తెలిపారు.

## ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసులను హడలెత్తిస్తోన్న పెద్దపులి

మొదటిపేజీ తరువాయి

ఇప్పటివరకు రాజమహేంద్రవరం అటవీ పరిధిలో సంచరించిన పెద్దపులి.. మళ్లీ గంగవరం మండలంలోకి ప్రవేశించింది. పులి సంచారంతో ఆయా గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. నిన్న ఏలేరు రిజర్వాయర్ బ్యాక్ వాటర్, ఆర్డీపురం పరిసరాల్లో సంచరించింది. గతంలో పులిని బంధించినపుడు .. పులి మెడకు రేడియో కాలర్ పరికరాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో పులి ఎక్కడుందనే కచ్చిత వివరాలను తెలుసుకుంటున్నారు.

పోలవరం జిల్లాలోని వేములోవ, పిడతమామిడి, రాములుదేవపురం, వడ్డిచెరువు గ్రామాల్లో అటవీ శాఖ అధికారులు పర్యటించి అక్కడి ప్రజలను అప్రమత్తం చేశారు. నాలుగు నెలల్లో 20 పశువులపై పెద్దపులి దాడి చేసిందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి, తెల్లవారుజాము సమయాల్లో ప్రజలు ఒంటరిగా అడవి వైపు వెళ్లవద్దని డీఎఫ్‌వో సూచించారు. పశువులను బయటకు వదలొద్దని విజ్ఞప్తి చేశారు. పులి దాడిలో మృతి చెందిన పశువులకు నష్టపరిహారం అందిస్తామని ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ప్రత్యేక రెస్క్యూ టీమ్‌లు రంగంలోకి దిగాయని... వీలైనంత త్వరలో పట్టుకుంటామని అధికారులు తెలిపారు. దట్టమైన అడవి కావడం వల్ల పులిని బంధించడం కొంత ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు.

## డీఎస్సీ నిర్వహణపై ఆరోపణలు అవాస్తవం: కోన శశిధర్

మొదటిపేజీ తరువాయి

అమరావతి: డీఎస్సీ నిర్వహణపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. డీఎస్సీని పూర్తి పారదర్శకంగా నిర్వహించామని చెప్పారు. మెరిట్ ఆధారంగానే నియామకాలు చేపట్టినట్లు వెల్లడించారు. డీఎస్సీ ప్రశ్నపత్రాలను ఎవరూ లీక్ చేయలేరన్నారు.

"డీఎస్సీలో 16,347 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చాం. 3.36 లక్షలమంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. 154 టీసీఎస్ అయాన్ సెంటర్లలో, 89 సెషన్లలో పరీక్షలు నిర్వహించాం. 15,941 మందికి నియామకపత్రాలు ఇచ్చాం. డీఎస్సీపై 226 కేసులు వేసినా.. రికార్డు సమయంలో 148 రోజుల్లోనే నియామకాలు పూర్తి చేశాం. డీఎస్సీలో టెట్‌కు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. తొలిసారి ఎస్సీ సబ్‌క్లాసిఫికేషన్, హారిజాంటల్ రిజర్వేషన్లు అమలు చేశాం. అక్రమాలకు తావులేకుండా ప్రతీది ఆన్‌లైన్ విధానంలో చేశాం. 24 రోజులపాటు వేర్వేరు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించడం వల్ల నార్మలైజేషన్ చేశాం.

ఆరు నుంచి 10 మంది నిపుణులు కూర్చొని ఒక్కో సబ్జెక్టుకు ప్రశ్నపత్రాలు తయారు చేస్తారు. ఒక్కో సబ్జెక్టుకు 3 వేల ప్రశ్నలు రూపొందిస్తారు. అనంతరం వాటిని టీసీఎస్ సర్వర్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇద్దరు మాత్రమే ఈ పని చేస్తారు. అనంతరం సిస్టమ్‌లో ఎన్‌క్రిప్ట్ అయ్యి ఉన్న ప్రశ్నపత్రాలు డీక్రిప్ట్ అవుతాయి. జంబ్లింగ్ విధానంలో అభ్యర్థులకు వేర్వేరుగా ప్రశ్నలు వస్తాయి. దేశంలోని చాలా ప్రభుత్వ సంస్థలు టీసీఎస్ అయాన్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నాయి. టీసీఎస్ అయాన్ సాఫ్ట్‌వేర్‌లో ఎలాంటి అక్రమాలకూ అవకాశం లేదు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఉంటాయి. పరీక్ష నిర్వహణ సమయంలోనూ ఎలాంటి అక్రమాలూ జరిగే అవకాశం లేదు.

అభ్యర్థుల మార్కులను వెబ్‌సైట్‌లో ప్రచురించాం. మార్కులు ప్రచురించలేదని కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు. దరఖాస్తు సమయంలోనే అన్ని సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని చెప్పాం. కొందరు అభ్యర్థులు ఈ నిబంధన సడలించాలని కోరడంతో మార్చాం. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను పిలిచాం. డీఎస్సీలో అక్రమాలు చేయాల్సిన అవసరం ఎవరికీ లేదు. అర్హత ఉన్నవాళ్లను ఎవరినీ పక్కన పెట్టలేదు. అభ్యర్థులు అడిగిన ప్రతి ప్రశ్నకూ సమాధానం చెప్పాం" అని కోన శశిధర్ చెప్పారు.

## తితిదేకు భారీ విరాళం అందించిన నీరా రాడియా

మొదటిపేజీ తరువాయి

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానానికి భారీ విరాళం అందింది. ఒక విద్యుత్ బస్సుతో పాటు వైకుంఠ క్యూ కాంప్లెక్సు ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌కు ఉపయోగపడే 15 యాపిల్ ట్యాబ్‌లను నీరా రాడియా అందజేశారు. శ్రీవారి ఆలయం ఎదుట విద్యుత్ బస్సుకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం బస్సు తాళం, ట్యాబ్‌లను తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరికి.. దాత అందించారు. అనంతరం ఛైర్మన్, ఇతర అధికారులు బస్సులో ప్రయాణించి బస్సు సామర్థ్యాన్ని పరీక్షించారు. తితిదేలో మొత్తం 20 ధర్మరథం బస్సులు ఉంటే.. వాటిలో 14 విద్యుత్ బస్సులు ఉన్నాయని అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. ధర్మరథం బస్సులు 380 ట్రిప్పుల ద్వారా 21 బస్ స్టాప్‌లలో భక్తులకు సేవలందిస్తున్నాయని తెలిపారు.

# కాళేశ్వరం 9వ ప్యాకేజ్ పనులను పరిశీలించిన బిజెపి నాయకులు

**– బిజెపి మండల అధ్యక్షుడు కోడే రమేష్ ఆధ్వర్యంలో**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని ముస్తపానగర్ గ్రామంలో కాళేశ్వరం 9వ ప్యాకేజీ బట్టల చెరువు పనులను పరిశీలించిన బిజెపి నాయకులు ఈ సందర్భంగా మండల అధ్యక్షులు కోడె రమేశ్ మాట్లాడుతూ
కాళేశ్వరం 11వ ప్యాకేజీ పనులు పూర్తిచేసుకుని మధ్య మానేరు నుండి మల్లన్న సాగర్ కు నీటిని తరలిస్తా ఉంటే సిరిసిల్ల నియోజకవర్గ మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే కేటి రామారావు గారి అసమర్థత వల్ల కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనులు అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయి అన్నారు. కెసిఆర్ గారు నదులకు నడక నేర్పిన నాయకుడు అయితే మరి ఎమ్మెల్యే కేటీ రామారావు గారు మీరు దేనికి నడక నేర్పారో తెలుపాలని అని ప్రశ్నించారు. ఇప్పటివరకు



కాళేశ్వరం 9వ ప్యాకేజ్ పనులకు వెయ్యి కోట్లకు పైన ఖర్చు అయినా ఏ ఒక్కనాడు కూడా రివ్యూ నిర్వహించని అసమర్థపు ఎమ్మెల్యే అన్నారు. కేటి రామారావు గారికి రైతులు పైన, ప్రజలు పైన ఏమాత్రం గౌరవం లేని వ్యక్తి అని కేటి రామారావు గారు సిరిసిల్ల ఎమ్మెల్యే నీ అని మరిచి రాష్ట్రం మీద పడి కారు కూతలు కూస్తూ పబ్బం గడుపుతున్నాడని అన్నారు. కాళేశ్వరం తొమ్మిదవ ప్యాకేజీ పనులు పూర్తి చెయ్యలేని వ్యక్తి సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండని వ్యక్తి రైతులకు, ప్రజలకు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరియు ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఎన్నికలకు ముందు వచ్చి తొమ్మిదవ ప్యాకేజీ పనులు పూర్తి చేస్తామని మాట ఇచ్చి ప్రజల కోసం చేపట్టిన ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం పాలైన ప్రభుత్వం, బాధ్యతను గాలికి వదిలేసి పనులను పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు . ఇప్పటివరకు తట్టెడు మట్టిని తీయక పోవడం కాంగ్రెస్ ప్రజాపాలనకు నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొని 9వ ప్యాకేజీ పనులు పూర్తి చేసి ప్రజలకు తాగు , సాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింలు డాక్టర్ సత్యనారాయణ సర్వోత్తమ్ దేవేందర్ యాదవ్ తిరుపతి శ్రీనివాస్ గౌడ్ శ్రీనివాస్ చారి దేవా గౌడ్ బాలయ్య పూల్యా నాయక్ స్వామి దేవేందర్ నాయక్ సత్యం నవీన్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# అడ్మిషన్ల కక్కుర్తి,... ఇతర స్కూళ్లపై తప్పుడు ప్రచారాలు ...

మే కార్తి దినపత్రిక సిద్దిపేట జిల్లా బ్యూరో ఇంచార్జ్ తాళ్ల రవీందర్ రెడ్డి మే 31

అడ్మిషన్ల కోసం ఇతర పాఠశాలలపై తప్పుడు ప్రచారం చేయడం, తమ స్కూల్లో సీట్లు నింపుకోవడానికి అనుసరిస్తున్న ఈ అనైతిక విధానాలు విద్యావ్యవస్థకే మచ్చగా మారుతున్నాయి. కొన్ని ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థలు తమ అడ్మిషన్ల లక్ష్యాన్ని చేరుకోవడం కోసం దిగజారి సోషల్ మీడియా, మరియు ఇతర మార్గాల ద్వారా ప్రత్యర్థి పాఠశాలలపై దారుణంగా దుష్ప్రచారాలు చేస్తుంటాయి. ఈ తప్పుడు ప్రచారాలు ఎలా జరుగుతాయి? సోషల్ మీడియా దుర్వినియోగం: ప్రత్యర్థి స్కూళ్లపై ఫేస్బుక్, వాట్సాప్ లలో ఫేక్ ప్రొఫైల్స్ ద్వారా తప్పుడు సమాచారం లేదా వందల బ్రాంచీల్లో ఎక్కడో వచ్చిన వాటిని ఇక్కడ మార్ఫింగ్ చేసిన ఫోటోలను పోస్ట్ చేయడం.కమిషన్ల ఆశ: కొన్ని ప్రాంతాలలో పాఠశాల నిర్వాహకులు కొంతమంది తమ టీచర్లను, వ్యక్తులను లేదా ఏజెంట్లను నియమించి, వారికి కమిషన్ల ఆశ చూపి పక్క స్కూళ్ల పేరెంట్స్‌కు తప్పుడు మాటలు చెప్పించి వారి స్కూళ్లలో చేర్చుకునేలా చేయడం.వదంతులు సృష్టించడం: కొంతమంది పాఠశాలల నిర్వాహకులు తమ వ్యక్తిత్వాన్ని మరియు కుటుంబాలను తాకట్టు పెట్టి అడ్మిషన్ల కొరకు ఇంటింటికి తిరిగి చేసే ప్రచారం లో భాగంగా తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించి, "ఆ స్కూల్‌లో ఫ్యాకల్టీ బాలేరు, త్వరలో మూతపడుతోంది, స్కూలును అమ్మేశారు, చాలామంది మా స్కూల్లోనే జాయిన్ అయ్యారు.." అంటూ తల్లిదండ్రుల్లో భయాందోళనలు సృష్టించడం.పాఠశాలలు ఏం చేయవచ్చు? లీగల్ నోటీసు: ఈ ప్రచారం వల్ల మీ పాఠశాల ప్రతిష్టకు మరియు అడ్మిషన్లకు నష్టం వాటిల్లితే, బాధ్యులైన స్కూల్ యాజమాన్యంపై పరువు నష్టం దావా వేయవచ్చు.కౌంటర్ క్యాంపెయిన్: మీ స్కూల్ సాధించిన విజయాలు, విద్యార్థుల ప్రతిభ, మరియు మౌలిక వసతులను హైలైట్ చేస్తూ పాజిటివ్ ప్రచారం చేసుకోవడం ద్వారా ఈ వదంతులను తిప్పికొట్టవచ్చు.తల్లిదండ్రులకు ఈ సమస్యకు ఏకైక పరిష్కార మార్గం: (స్కూల్ విజిట్): వదంతుల నేపథ్యంలో "స్కూల్ మూతపడుతుంది... మూసేశారు... అమ్మేశారు..." అని చెప్పే వారిది నోరా? తాటి మట్టా? లేక అది మరుగు దొడ్డా? అనేది వారి విజ్ఞతకే వదిలేయాలి. ఇలాంటి సమయంలో కేవలం వారు చెప్పే మాటలు పేరెంట్స్ గుడ్డిగా నమ్మకుండా, నేరుగా ఆయా స్కూళ్లను సందర్శించి నిజంగానే ఆ స్కూల్ మూత పడిందా? నిజమా కాదా? స్వయంగా పరిశీలించడం ఉత్తమం.

ఇకనైనా తప్పుడు ప్రచారాలు మానుకోండి విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించండి జగ్గు మల్లారెడ్డి, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ.

# ప్రొఫెసర్ నాగేశ్వర్ చిత్రపటం పై చెప్పులతో కొట్టిన జనసైనికులు



**– తెలంగాణలో జనసేన పార్టీ బలపడుతున్నది కాబట్టే పవన్ కళ్యాణ్ ను టార్గెట్ చేస్తున్నారు.**

**– ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్నట్టు నటించి తొత్తులతో పవన్ కళ్యాణ్ పై దూషణలు చేయించడం సిగ్గుచేటు.**

**– తెలంగాణ ద్రోహులందరు ఒక్కటైనా పవన్ కళ్యాణ్ ను ఏమీ చేయలేరు.**

**– జనసేన పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి ఘాటు విమర్శలు.**

మేకార్తి దినపత్రిక కరీంనగర్ టౌన్ రిపోర్టర్,మంద జయ ప్రకాష్ రెడ్డి మే 31.

తెలంగాణలో జనసేన పార్టీ రోజు రోజుకు ప్రజల్లో ఆదరణ పెరిగి బలపడుతున్నది కాబట్టే ఓర్చుకోలేని ప్రొఫెసర్ నాగేశ్వర్ మరియు ఆయన తొత్తులు కొంతమంది లెఫ్ట్ పార్టీల సానుభూతిపరులు, అర్బన్ నక్సలైట్లలందరు ఒక్కటై జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని కరీంనగర్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.
ఆదివారం రోజున తెలంగాణ చౌక్ లో కళ్యాణ్ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న బేతి మహేందర్ రెడ్డి, కందుల రాజీ రెడ్డి లు, జనసైనికులు ప్రొఫెసర్ నాగేశ్వర్ చిత్ర పటం పై చెప్పులతో కొట్టి చిత్రపటాన్ని తగలబెట్టడం జరిగింది. ఈ సందర్భంగా బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పై ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకున్నట్టు నటించి ఆయన తొత్తులైన అర్బన్ నక్సలైట్లు, లెఫ్ట్ పార్టీల సానుభూతిపరులు, తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని ఉద్యమ ద్రోహులు, సనాతన హైందవ ధర్మ వ్యతిరేకులందరు ప్రణాళిక ప్రకారం పవన్ కళ్యాణ్ పై దుష్పచారం చేయడం, వ్యక్తిగత దూషణలు చేయడం లాంటివి చేస్తున్నారని



వాటన్నింటిని తిప్పికొట్టడానికి జనసైనికులు సిద్ధంగా ఉన్నారని, రాబోయే రోజుల్లో ఇలాంటి లెఫ్ట్ భావజాలం గల వ్యక్తులను జనసైనికులు ఉరికించి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని బేతి మహేందర్ రెడ్డి హెచ్చరించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన ఆయనను ఏమీ చేయలేరని, తెలంగాణలో జనసేన పార్టీ పటిష్టత కోసం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని, తెలంగాణ ప్రజల మనసులో ఉన్న భావాలనే పార్టీ ఎజెండాగా పార్టీ దూసుకుపోతుందని, అలాగే రాబోయే రోజుల్లో తెలంగాణలో జరిగే అన్ని ఎన్నికల్లో పోటీ చేస్తుందనే విషయాన్ని జీర్ణించుకొలేక ఇలాంటి తప్పుడు ప్రచారాలు, వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని, వీటన్నింటిని తిప్పి కొట్టేందుకు జనసైనికులు సిద్ధంగా ఉన్నారని జనసేన పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్, కరీంనగర్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ కందుల రాజీ రెడ్డి, వొద్నల రాజు, కాసా రాజు, పొన్నాల తిరుపతి, కళ్యాణ్ సేన కరీంనగర్ సభ్యులు సామ చరణ్ రెడ్డి, గూడూరి రామ్, యశ్వంత్రావ్, నాయిని రవి వర్మ, రాకేష్, మల్లయ్య, శ్రీనివాస్ రావు, కళ్ళేపెల్లి,సాత్విక్, హర్ష, శ్రీనివాస్, శివాజీ, సురేష్, ప్రవీణ్, శ్రీధర్, అభిషేక్, హరీష్, సృజన్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ తరుపున ఒక కోటి రూపాయల క్లేమ్ సెటిల్మెంట్




మేకార్తి దినపత్రిక మే 31 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో 2018 వ సంవత్సరంలో హైదరాబాద్ కు చెందిన ఎస్. సత్యనారాయణ అనే కస్టమర్ ఒక కోటి రూపాయల టర్మ్ పాలసీ సంవత్సరంకు =o. 48,500/- చెల్లించి తీసుకున్నారు. కానీ మార్చ్ 2026 వ సంవత్సరంలో కస్టమర్ హఠాత్ మరణం చెందడం వలన వారి కుటుంబానికి టాటా ఏఐఏ కంపెనీ తరఫున సికింద్రాబాద్ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ కె. పరమేశ్వర్ రెడ్డి ఒక కోటి రూపాయల చెక్కును అందజేశారు. ఈ రూపాయలు వారి పిల్లల చదువుకు ఎంతగానో దోహదపడతాయని మేనేజర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజినెస్ పార్ట్నర్ చింతపల్లి శ్రీనివాసులు , చీఫ్ బిజినెస్ అసోసియేట్ బర్రె అమరేందర్ రెడ్డి(సిద్దిపేట) మరియు అడ్వైసర్లు ,లీడర్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత ఎంతో అవసరమని పేర్కొన్నారు అదేవిధంగా టర్మ్ పాలసీ ప్రాముఖ్యతను వివరించారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం అఖిలపక్ష భేటిని స్వాగతిస్తున్నాం

**తెలంగాణ ఉద్యమకారులు సాంస్కృతిక సారథి కవి గాయకులు పిన్నింటి రత్నం.**

మేకార్తి దినపత్రిక మే 31 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



కొమురవెల్లి : తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు జూన్ 4న అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ఉద్యమకారులు సాంస్కృతిక సారథి కవి గాయకులు పిన్నింటి రత్నం సంతోషం వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ తెలంగాణ తొలి మలిదశ ఉద్యమంలో ఎంతో మంది త్యాగాలు చేశారని తెలంగాణ కోసం క్షేత్రస్థాయిలో పాల్గొన్న వారిని పారదర్శకంగా గుర్తించి అర్హులైన జాబితా తయారు చేయాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కే కేశవరావు కమిటీని స్వాగతిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర సాధనలో పోరాడి జైలు శిక్షలు అనుభవించిన వారిని వేలాదిమంది విద్యార్థులు,మేధావులు యువకులు,నిరుద్యోగులు, కార్మికులు,కర్షకులు కవులు కళాకారులు మహిళలు ఇలా ఎందరో త్యాగాలు వెలకట్టలేనివని గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని ముందుకు నడిపించిన ఉద్యమకారులను గుర్తించాలని అమరవీరుల కుటుంబాలను గౌరవంగా గుర్తింపు ఇవ్వాలని నిజమైన ఉద్యమకారులను పారదర్శకంగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# అమ్మ మాట అంగన్వాడీ బాట

మేకార్తి దినపత్రిక మే 31సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



చేర్యాల మండల నాగపురి గ్రామంలో గ్రామ సర్పంచ్ బి.సంతోషి ఆధ్వర్యం లో అంగన్వాడీ బడి బాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 3 నుండి 5 సంవత్సరాల వయసు చిన్నారుల ను అంగన్వాడీ కేంద్రం లో చేర్పించి అక్కడి స్వేచ్ఛ వాతావరణం లో ఆట, పాట లతో అమ్మ ని మరిపించే చక్కనైన తెలుగు, ఇంగ్లీష్ బోధన జరుగుతుంది, అంతే కాకుండా నాణ్యమైన పౌష్టికాహారం అందించడం జరుగుతుంది. శారీరక, మానసిక, సామాజిక, సృజనాత్మక ,మేధోపరమైన అభివృద్ధి కి అంగన్వాడీ టీచర్లు చిన్నారులకు అనేకమైన కార్యకలాపాలు నేర్పిస్తూ ప్రైవేట్ పాఠశాలలకి దీటుగా అంగన్వాడీ కేంద్రాలని నడిపిస్తున్నారు. కనుక 3 సంవత్సరాలు పైబడిన పిల్లల్ని అంగన్వాడి లోనే చేర్పించాలి అని సర్పంచ్ సంతోషి , సూపర్వైజర్ పావని ,గ్రామ కార్యదర్శి రాజు , ఉప సర్పంచ్ సందీప్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ వి.రాధ ,జ్యోతి, మంజుల, కనకమ్మ, వెంకటలక్ష్మి, మరియు ఆశ హెల్పర్స్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 30 డీఈఓ పోస్టులు ఖాళీగా పెట్టి, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా గాలికి వదిలేసింది.

**– పెండింగ్ బిల్లులు, డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించకుండా ఉపాధ్యాయులను తీవ్ర ఆర్థిక క్షోభకు గురిచేస్తున్నారు.**
**– మాజీ మంత్రి హరీశ్ రావు**

మేకార్తి దినపత్రిక
సిద్దిపేట రెడ్డి సంఘంలో ఏర్పాటు చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ..రాష్ట్రంలో 33 జిల్లాలు ఉంటే కేవలం ముగ్గురే రెగ్యులర్ డీఈఓలు ఉన్నారు. 30 చోట్ల పోస్టులు ఖాళీగా పెట్టి విద్యావ్యవస్థను ప్రభుత్వం గాలికి వదిలేసింది.అదనపు కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జడ్పీ సీఈఓలు, ఐఏఎస్ అధికారులకు డీఈఓ బాధ్యతలు అప్పగించడం వల్ల వారు విద్యపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. తక్షణమే రెగ్యులర్ డీఈఓలను నియమించాలి.పాఠశాలల్లో స్కావెంజర్ల బిల్లులు గత ఏడాదివి నాలుగు నెలలు, ఈ ఏడాదివి నాలుగు నెలలు పెండింగ్‌లో ఉండటంతో ఆ భారం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై పడుతోంది.గత ప్రభుత్వం చేపట్టిన మన ఊరు – మన బడి కార్యక్రమాన్ని అర్ధాంతరంగా నిలిపివేయడం సరికాదు. కావాలంటే పథకం పేరు మార్చుకోవాలి కానీ, బడుల అభివృద్ధిని ఆపొద్దు. కొత్తగా ఒక్క గది కూడా కట్టే ప్రయత్నం చేయడం లేదు.ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు, డీఏల సమస్యలతో పాటు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు బెనిఫిట్స్ ఎప్పుడు వస్తాయో తెలియని దుస్థితి నెలకొంది.సాధారణంగా సొంత జిల్లాలో డీఈఓగా పనిచేసే అవకాశం రాదు. కానీ శ్రీనివాస్ రెడ్డి సిద్దిపేట బిడ్డ కావడంతో, నాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా ఇక్కడ అవకాశం కల్పించాము.నాలుగు సంవత్సరాల పాటు డీఈఓగా సొంత జిల్లాకు సేవలందించి, ఎవరి మనసు నొప్పించకుండా ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఆయన అందరి మన్ననలు పొందారు.వరుసగా ఆరు సంవత్సరాలు పదో తరగతి ఫలితాల్లో సిద్దిపేట జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడంలో డీఈఓగా శ్రీనివాస్ రెడ్డి చేసిన విశేష కృషి ఎంతో ఉంది.మన ఊరు – మన బడి పనులను వేగవంతంగా పూర్తి



చేయించి, అత్యధిక పాఠశాలలు బాగుపడటంలో ఆయన పాత్ర కీలకం. అదనంగా జిల్లా క్రీడాధికారిగా కూడా బాధ్యతలు చేపట్టి మంచి పేరు తెచ్చుకున్నారు.నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం 33 జిల్లాలను ఏర్పాటు చేయడం వల్లే చాలా మందికి డీఈఓలుగా అవకాశం దక్కింది. తద్వారా విద్యావ్యవస్థపై క్లోజ్ మానిటరింగ్ సాధ్యమైంది.ఖానాపూర్‌లో పుట్టి పెరిగిన తిమ్మాయిపల్లి ముద్దుబిడ్డ శ్రీనివాస్ రెడ్డికి ఇది పదవికి మాత్రమే విరమణ, ఆయన సేవలకు విరమణ లేదు. భవిష్యత్తులోనూ ఈ ప్రాంతానికి ఆయన తన సేవలు అందించాలి. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

# అంగన్వాడి బడిబాట కార్యక్రమంలో కౌన్సిలర్ . ఐరేనీ అఖిల.




మేకార్తి దినపత్రిక మే 31 సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ పాపని స్వామి ప్రతినిధి.
సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ. బడి బాట కార్యక్రమంలో.బాగంగా 20వ వార్డు కౌన్సిలర్ అయిరేని అఖిల సాయి తేజ గౌడ్ గారి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఐదు సంవత్సరంలోపూ పిల్లలను అంగన్వాడీ బడిలో చేర్పించాలని పిల్లలకు మంచి పౌష్టికాహారం మరియు చదువుతోపాటు ఆటలు అన్ని సౌకర్యాలు అందిస్తున్నాం, తల్లిదండ్రులకు వారి పిల్లలను అంగన్వాడిలో చేర్పించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ చంద్రకళ గారు అంగన్వాడి టీచర్ ఆయా వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.




మేకార్తి దినపత్రిక 31 మే మెదక్ జిల్లా నిజాంపేట్ మండలం రిపోర్టర్ రాము
మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలోని శ్రీ రేణుక మాత ఫంక్షన్ హాల్ లో ఆదివారం 1996-97 బ్యాచ్ కి సంబంధించి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో సన్మానించారు. 30 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై పూర్వ విద్యార్థులను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. చిన్నప్పుడు చదువుకున్నటువంటి తీపి జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజిరెడ్డి, జనార్దన్ రెడ్డి, బాలయ్య, విద్యార్థులు నసీరుద్దీన్, మహేందర్, శివ ప్రసాద్, ప్రభుదాస్, ఎల్లం యాదవ్, నర్సింలు, ఎల్లం, యాదగిరి, రాము, తదితరులు ఉన్నారు.

# మున్సిపల్ కార్పొరేషన్ లో సింగిల్ టెండర్లను వెంటనే రద్దు చేయాలి.

**–సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్.**

మేకార్తి దినపత్రిక
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో యుఐడిఎఫ్ నిధులతో చేపట్టిన టెండర్లకు సింగిల్ టెండర్లు మాత్రమే దాఖలు అయినందున వెంటనే వాటిని రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.టెండర్ల ప్రక్రియ పై శనివారం బద్దం ఎల్లారెడ్డి భవన్ లో సిపిఐ నాయకులతో పంజాల శ్రీనివాస్ సమావేశమయ్యారు.ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలకు ముందు మంజూరైన 50 కోట్ల రూపాయల పనులకు టెండర్లు నిర్వహించిన వాటికి ఆమోదం లభించకుండా అడ్డుపడి కాంట్రాక్టర్లు తిరిగి అన్ని డివిజన్లకు ప్రాధాన్యమిస్తూ టెండర్లు నిర్వహిస్తే వాటిలో 87 టెండర్లలో 69 పనులకు సింగిల్ టెండర్ మాత్రమే దాఖలు కావడం చూస్తుంటే మున్సిపల్ కార్పొరేషన్ లో అవినీతి అక్రమాలు జరిగే




అవకాశం ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.నగరంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేసిందని, పెద్ద మొత్తంలో పనులకు కేవలం ఒక బిడ్ రావడం పలు అనుమానాలకు తావిస్తోందని,టెండర్ ప్రక్రియలో పోటీ లేకపోవడం వల్ల ప్రభుత్వానికి నష్టం జరిగే అవకాశం ఉందని,ప్రజా ధనం దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందని , పెద్ద,పెద్ద పనులకు పలువురు కాంట్రాక్టర్లు పోటీపడే అవకాశం ఉన్నా ఈసారి సింగల్ టెండర్ మాత్రమే వేయడం వెనుక ఆంతర్యమేంటో అర్థంకావడం లేదని,నగర ప్రజలకు పలు అనుమానాలు కలుగుతున్నాయని,బిడ్ పక్రియ పారదర్శకత అంశాలపై అధికారులు సమగ్ర విచారణ జరిపించాలన్నారు. నగర పాలక సంస్థలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీనీ,ఆ పాలక వర్గాన్ని మచ్చిక చేసుకోవడంలో కాంట్రాక్టర్లు ముందుంటారని, బల్దియాలో ఎలాంటి టెండర్ల ప్రక్రియ జరిగినా కాంట్రాక్టర్ల పెత్తనం కనబడుతుందని, ఐఏఎస్ అధికారి కమిషనర్ గా ఉన్నప్పటికీ అవినీతి రాజ్యమేలుతుందని, అధికారులకు మున్సిపల్ పై పట్టు లేకపోవడం సిగ్గుచేటని, వెంటనే మున్సిపల్ లో దాఖలైన సింగిల్ టెండర్లను రద్దు చేయాలని లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని పంజాల శ్రీనివాస్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, టేకు మల్ల సమ్మయ్య,న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు పాల్గొన్నారు.

# నిరుపేద గీత కార్మిక కుటుంబాన్ని పరామర్శించి 10,000 రూపాయల ఆర్థిక సహాయం .

**ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సేఫ్టీ కిట్లు వాడాలని గీత కార్మిక కుటుంబాలను కాపాడుకోవాలని విన్నపం చేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్**

మేకార్తి దినపత్రిక
జనగామ నియోజకవర్గం మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన గుండగోని రాజు ప్రమాదవశాత్తు చిన్న వయస్సులో తాడి చెట్టు పైనుండి పడి మరణించారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుకున్న నాగపురి కిరణ్ కుమార్ గ్రామానికి వెళ్లి, రాజు కుటుంబాన్ని పరామర్శించిన సందర్భంలో రాజు గౌడ్ కు 6 నెలల పసి పాప,4 సం.బాబు ఉండడం మరియు వారికి ఎటువంటి ఆస్తులు లేకపోవడం , కనీసం ఉన్న ఇల్లు కూడా దీనస్థితి లో ఉండటం చూసి 10,000 రూ.( పది వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని రాజు గౌడ్ సతీమణి పావని కి అందజేశారు. తప్పకుండా భవిష్యత్తులో రాజు గౌడ్ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాగపురి కిరణ్ కుమార్ మాట్లాడుతూ దయ చేసి గీత కార్మిక కుటుంబాలు సేఫ్టీ కిట్లు వాడాలని, చిన్న చిన్న పిల్లలు ఉన్న రాజు కుటుంబాన్ని చూస్తుంటే గుండె తరుక్కు పోతుందని, అందరు సేఫ్టీ కిట్లు వాడి కుటుంబాలను కాపాడుకోవాలని విన్నపం చేశారు. ఈ కార్యక్రమంలో మద్దూరు మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు గుండెగోని లలితా-మల్లేశం, వల్లంపట్ల కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు వేల్పుల ప్రకాశం కాంగ్రెస్ వార్డు సభ్యులు నలగొప్పుల రాజుగౌడ్, మల్లిగారి రంజిత్, గుండెగోని స్వాతి - రాకేష్ మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు నలగొప్పుల



వెంకటయ్య గౌడ్,ఆలేటి లింగం, గుండెగోని రామచంద్రం, పోతిరెడ్డి నర్సింలు, చింతల మల్లారెడ్డి,నలగొప్పుల కృష్ణమూర్తి గౌడ్, గుండెగోని రాజు,ఇప్పల మల్లేశం,వీణ రహీమ్, గుండెగొని శ్రీశైలం, చేట్టుకురి యుగంధర్ ,సోషల్ మీడియా వేల్పుల అశోక్, కొత్త దినేష్ ఆలేటి నరేష్,వంగపల్లి సాయితేజ, మరియు గ్రామ పెద్దలు ఢ యువకులు పాల్గొన్నారు.

# గ్రామాలలో ఉన్న వారి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి.

**- గ్రామాల్లో రైతుల ఆవేదన.**
**- సర్పంచ్ డిమాండ్.**





మేకార్తి దినపత్రిక మెదక్ జిల్లా నిజాంపేట్ మండలం రిపోర్టర్ రాము.
మెదక్ జిల్లా నిజాంపేట్ మండల మరియు గ్రామలలో ఉన్న వరి ధాన్యాన్నీ వెంటనే కొనుగోలు చేయాలి. ప్రభుత్వం రైస్ మిల్లర్ల నిర్లక్ష్యాన్నీ తీవ్రంగా ఖండిస్తున్నాము. కల్వకుంట గ్రామ సర్పంచ్ అందె కొండల్ రెడ్డి గారురజాక్ పల్లి సర్పంచ్ కనకరాజు . రైతులకుఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి.లేని పక్షంలో రైతులతో కలిసి పెద్ద మొత్తం లో ధర్నా నిర్వహిస్తాం . సర్పంచ్ లు అందె కొండల్ రెడ్డిగారు వొజ్జ కనకరాజుగారు డిమాండ్ చేశారు.
పక్క మండలంలో నుంచి వచ్చిన ధాన్యన్నీ సేకరిస్తున్నారు. పక్క మండలం పై ఉన్న శ్రద్ధ రైస్ మిల్లర్ల కు మన మండల ధాన్యం మీద సోయి లేదు. మరియు ఇది వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి ట్రాక్షిట్ కొట్టలేదు అధికారులు, స్థానిక ఎమ్మెల్యేగారు రాష్ట్రప్రభుత్వం స్పందించి వడ్ల కొనుగోలు చేయాలని.కోరుతున్నాము.

# ముస్తాబాద్‌లో నార్కోటిక్ డాగ్‌తో ఆకస్మిక తనిఖీలు...

మేకార్తి దినపత్రిక
మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా ముస్తాబాద్ పట్టణంలోని పలు షాపులు, వాణిజ్య సంస్థల్లో పోలీసులు నార్కోటిక్ డాగ్ సహాయంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వస్తువులు, మాదకద్రవ్యాల నిల్వలు లేదా విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టారు. ప్రజల్లో అవగాహన కల్పిస్తూ మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ తనిఖీలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.




# పెద్దిలో అప్పలసూరిగా జగపతిబాబు

అప్పలసూరిగా 'పెద్ది'లో తన నటనతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు నటుడు జగపతి బాబు . రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జగపతిబాబు తన కెరీర్ గురించి మాట్లాడారు. మన కష్టానికి తగిన ఫలితం కచ్చితంగా లభిస్తుందన్నారు. సినిమా రంగంలో ఉన్నంత ఆనందం నాకు ఇంక ఎందులోనూ కనిపించదు. ఇందులో ఏదైనా సాధ్యమవుతుంది. సహజంగా నా జీవితంలో ప్రతిదీ ఆలస్యంగా వస్తుంది. కెరీర్‌లో కూడా మొదట ఫ్లాప్‌ల నుంచి హిట్‌లకు వచ్చాను. అందుకే పరాజయాలను పెద్దగా పట్టించుకోను. ఏదో ఒకరోజు విజయం తప్పక వస్తుంది నమ్ముతా. జీవితం మన అంచనాలకు అందదు. తర్వాత ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. కానీ, ప్రతి ఒక్కరికి కష్టాలు కామన్‌గా ఉంటాయి. నేనూ ఎన్నో కష్టాలు పడ్డాను. ఇలా జరిగిందేంటని ఎప్పుడూ బాధపడలేదు. వాటి నుంచి ఏదో కొత్త పాఠం నేర్చుకున్నాను. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని ఎప్పుడూ నమ్ముతాను. బాధ వెనక సంతోషం కచ్చితంగా ఉంటుంది. నేను 2011 నుంచి 2013 వరకు ఎంతో బాధ అనుభవించా. దానికి తగిన సంతోషం ఇప్పుడు వచ్చింది. నా టైమ్ ఇప్పుడు స్టార్ట్ అయింది అనుకుంటున్నా అని జగపతి బాబు అన్నారు. సినిమాల విషయంలో ఎప్పుడూ ఒత్తిడికి గురి కాలేదని జగపతి బాబు ఈ సందర్భంగా తెలిపారు. ఫ్యామిలీ ఇష్యూ కాకుండా ఇంకా దేనిని పెద్ద సమస్యగా తీసుకోనని అన్నారు. 'పెద్ది'లో తనకు, రామ్ చరణ్‌కు మధ్య ఉండే బంధం అందరికీ నచ్చుతుందన్నారు. చరణ్ అన్ని సినిమాలకు కష్టపడతారని.. ఈ చిత్రంలో శరీరాకృతిని మార్చుకోవడం కోసం మరింత ఎక్కువ శ్రమించారని చెప్పారు.




# జానపద కథతో 'శక్తి శాలినీ'

'స్త్రీ', 'ముంజ్యా' లాంటి పలు విజయంతమైన చిత్రాలను నిర్మించిన మడాక్ ఫిల్మ్స్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా రాబోతున్న తదుపరి చిత్రం 'శక్తి శాలినీ'. 'సైయారా' విజయంతో సినీప్రియుల్ని మురిపించిన కథానాయిక అనీత్ పడ్డా ఈ సినిమాలో ప్రధానపాత్రలో నటిస్తుంది. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఇప్పటికే ఈ చిత్రంలో ఆమె ద్విపాత్రాభినయంలో కనిపించనుందని ఎప్పట్నుంచో ప్రచారం జరుగుతుంది. తాజాగా ఈ సినిమా జానపద కథ నేపథ్యంలో రూపొందుతుందని తెలిసింది. "బెంగాలీ పురాణాలలోని ఒక జానపద కథాంశాన్ని ఆధారంగా చేసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటివలే ఈ సినిమా భారీ క్లైమాక్స్ ఘట్టాల చిత్రీకరణను కూడా పూర్తి చేశారు. ఈ చిత్రం శక్తి, శాలినిల మధ్య రివెంజ్ డ్రామాగా రూపొందుతుంది. అనీత్ ఇందులో శక్తి అనే రక్షకురాలిగా, ప్రతీకారం తీర్చుకోవాలనే శాలినీ అనే ఆత్మగా ద్విపాత్రాభినయం చేస్తోంది. ఇందులో ఈ రెండు పాత్రల మధ్య జరిగే ఘర్షణ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంద"ని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఈ చిత్రంతో పాటు మోహిత్ సూరి దర్శకత్వంలో అహాన్ పాండే సరసన ఓ చిత్రంలో నటిస్తోంది అనీత్.



# జాసన్ సంజయ్ దర్శకుడిగా సిగ్మా

తమిళనాడు సీఎం, తమిళగ వెట్రి కజగం పార్టీ అధినేత విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మొదటి సినిమా 'సిగ్మా' విడుదల తేదీ తాజాగా ఖరారైంది. వైవిధ్యమైన పాత్రలతో మెప్పిస్తున్న టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ మరియు ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ హై-ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం జులై 31న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలోకి రానుంది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎ. సుబాస్కరన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మైండ్ గేమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తుండగా, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మనం కోల్పోయిన దాన్ని తిరిగి అదే స్థానంలో వెతుక్కోవడం, దానికోసం ఎంత మూల్యం చెల్లించాల్సి



వచ్చింది అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని చిత్ర యూనిట్ పేర్కొంది. కెనడాలోని టొరంటో ఫిల్మ్ స్కూల్‌లో ఫిల్మ్ మేకింగ్ కోర్స్ మరియు లండన్‌లో స్క్రీన్‌రైటింగ్ పూర్తి చేసిన జాసన్ సంజయ్, తన తండ్రి స్టార్ ఇమేజ్‌తో సంబంధం లేకుండా ఒక వైవిధ్యమైన కథాంశంతో మెగా ఫోన్ పట్టడం పరిశ్రమలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర టీజర్ మరియు పోస్టర్లు సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్ తెలుగు మరియు తమిళ భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది.




# చిరు చిత్రంలో నివేద?

'మెంటల్ మదిలో', 'బ్రోచేవారెవరురా' లాంటి విజయవంతమైన చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి నివేదా పేతురాజ్. వ్యక్తిగత కారణాలతో మూడేళ్లుగా తెరకు దూరంగా ఉన్న ఈ నాయిక ఇప్పుడు సినీప్రియుల్ని తిరిగి పలకరించేందుకు సిద్ధమవుతోంది. ఆమె ఇప్పటికే తెలుగులో వెంకటేశ్ 'ఆదర్శ కుటుంబం'లో ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిసింది. కాగా, ఇప్పుడామె మరో క్రేజీ సినిమాలోనూ భాగమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిరంజీవి కథానాయకుడిగా బాబీ దర్శకత్వంలో ఓ చిత్రం ముస్తాబవుతున్న సంగతి తెలిసిందే. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. అనస్వర రాజన్ ముఖ్య పాత్ర పోషిస్తోంది. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభించుకున్న ఈ సినిమాలో నివేదా ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. తనిప్పటికే సెట్స్‌లోకి అడుగు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. మాస్ అంశాలతో నిండిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో చిరుకి కుమార్తెగా అనస్వర కనిపించనుంది. ఈ చిత్రానికి తమన్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తీక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

# దేవిశ్రీతో ప్రయాణం ముగిసినట్లేనా?

టాలీవుడ్ దర్శకుడు సుకుమార్- సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'ఆర్య'తో మొదలైన వీరి ప్రయాణం 'రంగస్థలం', 'పుష్ప' వంటి ఇండస్ట్రీ హిట్స్ వరకు చేరి తెలుగు సినీ పరిశ్రమలో ఓ ప్రత్యేకమైన ముద్ర వేసింది. సుకుమార్ సినిమాలకు దేవిశ్రీ ఇచ్చిన సంగీతం అనేక సందర్భాల్లో సినిమాకే హైలైట్‌గా నిలిచింది. అందుకే ఈ కాంబోకు అభిమానుల్లో ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఇప్పటివరకు తన సినీ కెరీర్‌లో సుకుమార్ పూర్తి స్థాయిలో దేవిశ్రీ ప్రసాద్‌తోనే ప్రయాణించడం విశేషం. వీరిద్దరి మధ్య ఉన్న అండర్‌స్టాండింగ్, కథను సంగీతంతో మరింత ఎమోషనల్‌గా ఎలివేట్ చేసే తీరు ప్రేక్షకులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంది. అయితే ఇటీవల కాలంలో ఈ క్రేజీ కాంబినేషన్‌కు బ్రేక్ పడే అవకాశాలున్నాయంటూ ఫిలిం నగర్‌లో జోరుగా చర్చ సాగుతోంది. ముఖ్యంగా 'పుష్ప-2' నిర్మాణ సమయంలో ఇద్దరి మధ్య కొన్ని విభేదాలు తలెత్తినట్లు ప్రచారం జరిగింది. సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలకు దేవిశ్రీ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విషయంలో సుకుమార్ పూర్తిగా సంతృప్తి చెందలేదని, అందుకే కొన్ని భాగాలకు ఇతర సంగీత దర్శకుల సహాయం తీసుకున్నారనే టాక్ ఇండస్ట్రీలో వినిపించింది. ఈ పరిణామం దేవిశ్రీ ప్రసాద్‌ను అసంతృప్తికి గురిచేసిందని, ఆ బాధను ఆయన ఓ ఈవెంట్‌లో పరోక్షంగా వ్యక్తం చేశారనే చర్చ కూడా జరిగింది. ఇప్పుడు అదే చర్చ మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా సుకుమార్ తెరకెక్కించబోయే తదుపరి భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు దేవిశ్రీ ప్రసాద్ స్థానంలో కొత్త సంగీత దర్శకుడిని తీసుకోబోతున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదే సమయంలో దేవిశ్రీ ప్రసాద్ 'ఎల్లమ్మ' సినిమాతో హీరోగా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించబోతుండటం కూడా ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చింది.

# క్రైమ్ థ్రిల్లర్‌గా మరీచిక

సంజయ్ అలియాస్ సంజు (విరాజ్ అశ్విన్) ఓ కెఫేని నిర్వహిస్తుంటాడు. అతణ్ని వెంకట లక్ష్మి (అనుపమ పరమేశ్వరన్) ప్రేమిస్తుంది. ఎప్పుడూ అతని కెఫే చుట్టూ తిరుగుతుంటుంది కానీ, తన మనసులోని ప్రేమని మాత్రం వ్యక్తం చేయలేక సతమతమవుతుంది. ఇంతలో వెంకట లక్ష్మికి లండన్ నుంచి వచ్చిన మరీచిక (రెజీనా కసంద్రా) పరిచయమవుతుంది. వెంకటలక్ష్మి కారణంగానే సంజుకి పరిచయం అవుతుంది మరీచిక. ఆ ఇద్దరి మధ్య తక్కువ సమయంలోనే సాన్నిహిత్యం పెరుగుతుంది. ఒకరినొకరు ప్రేమించుకుంటారు. ఊహించని రీతిలో ఆ ఇద్దరి ప్రేమకు వెంకటలక్ష్మి కూడా సాయం చేస్తుంది. కానీ, అంతలోనే సంజుని మరీచిక దారుణంగా చంపేస్తుంది. కళ్లారా ఆ హత్యని చూసిన వెంకటలక్ష్మి పోలీస్‌స్టేషన్‌కి చేరుకుని ఫిర్యాదు చేస్తుంది. అసలింతకీ ప్రేమించిన సంజుని మరీచిక ఎందుకు హత్య చేసింది? అసలు మరీచిక ఎవరు? సంజుపై ఉన్న ప్రేమతో వెంకటలక్ష్మి ఏం చేసింది? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవల్సిందే. ప్రేమ, ద్రోహం, ప్రతీకారంతో ముడిపడిన కథ ఇది. పేరుకు తగ్గట్టే ఎండమావుల్ని గుర్తు చేస్తుంటాయి ఇందులోని సంఘటనలు, పాత్రలన్నీ! సున్నితమైన ఓ




ముక్కోణపు ప్రేమకథలా ప్రారంభమయ్యే సినిమా ఆ తర్వాత అనూహ్యమైన మలుపులతో ఓ క్రైమ్ థ్రిల్లర్‌గా మారిపోతుంది. ప్రధానమైన మూడు పాత్రలూ ఏది నిజం, ఏది అబద్ధం అనే ఉత్కంఠని రేకెత్తిస్తాయి. ఓ థ్రిల్లర్ కథని ప్రేమతో ముడిపెడుతూ రాసుకున్న తీరు ఆసక్తికరంగానే అనిపిస్తుంది. తెరపైన కథ చెప్పే విధానంలో ఎప్పటికప్పుడు మెరుపు వేగంతో మార్పులు చోటు చేసుకుంటాయి. కానీ, ఆ విషయంలో దర్శకుడు పాత పద్ధతుల్నే అనుసరించినట్టు ఈ సినిమా రుజువు చేస్తుంది. ఎ÷-లాష్‌బ్యాక్‌లో వెంకటలక్ష్మి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేసేవరకూ కథ ఊపందుకోదు. అప్పటివరకూ సన్నివేశాలు ఎలాంటి అనుభూతిని పంచకుండా అలా సాగుతూనే ఉంటాయి. హాస్యం, ప్రేమకథల్లోని సంఘర్షణ, కెమిస్ట్రీ తెరపై కనిపించవు. విరామ సన్నివేశాల నుంచే సినిమా కాస్త ఆసక్తిని రేకెత్తిస్తుంది. ద్వితీయార్ధంలో వచ్చే మలుపులు సినిమాకి ప్రధాన ఆకర్షణ. అసలేది నిజమనే ఉత్సుకత రేకెత్తిస్తుంది. దర్శకుడు లాజిక్స్ గురించి పట్టించుకోనేలేదు. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వ్యక్తులు ఏ కథ చెబితే అది పోలీసులు విని అక్కడిక్కడికే కేసుపై ఓ నిర్ణయానికొచ్చేస్తుంటారు. ఆ కేసులో ఉన్న వ్యక్తుల్ని, పరిసరాల్ని కనీసం ఆరా తీయడం కానీ, వివరాలు తెలుసుకోవడం కానీ కనిపించదు. దాంతో తెరపై జరిగే తతంగం అంతా నాటకీయంగానే అనిపిస్తుంది . మొత్తంగా ఈ కథలో థ్రిల్ ఉంది కానీ, తెరపైకి దాన్ని ఇంకాస్త బలంగా చూపించివుంటే బాగుండేది.

PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Printed at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.
RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com